నత్తనడకన ఇన్‌టేక్ వెల్ నిర్మాణం

- ఎల్–3 ఎత్తిపోతల పథకంలో కూలిన ఇన్‌టేక్ వెల్
- రూ.36లక్షలతో వెల్ పునర్నిర్మాణం
- రెండు నెలలుగా సాగుతున్న పనులు
- రైతులకు సాగునీరందక అవస్థలు



నిర్మాణంలో ఉన్న ఎత్తిపోతల పథకం ఇన్‌టేక్ వెల్(బావి)



నీరు లేక ఎండిపోయిన ఎల్–3 అవుట్ లెట్

నిడమనూరు : నాగార్జునసాగర్ ఎడమ కాల్వపై నిడమనూరు మండల కేంద్రంలో 28.2వ కిలోమీటరు వద్ద ఉన్న ఎల్ 3 లిఫ్టులో కూలిన ఇన్‌టేక్ వెల్ పునర్నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. ఈ లిఫ్టును 1992లో ఆనాటి నీటిపారుదల శాఖ మంత్రి జానారెడ్డి ఉన్నప్పుడు నిర్మించారు. అయితే గతేడాది ఆక్టోబర్‌లో ఆ లిఫ్టులోని ఇన్‌టేక్ వెల్ (బావి) కూలిపోయింది. దీంతో తాత్కాలికంగా ఇసుక బస్తాలతో వెల్‌ఏర్పాటు చేసి యాసంగి సీజన్‌కు సాగునీరందించారు. ఈ పథకం కింద గతంలో 4,800 ఎకరాలకు సాగునీరందేది.. ప్రస్తుతం ఇన్‌టేక్ వెల్ కూలడంతో రైతులకు సాగునీరందక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే కూలినప్పటి నుంచి రెండు, మూడు పర్యాయాలు నీటిని విడుదల చేయలేదు. ప్రస్తుతం కూడా సాగునీరందేలా లేదు.

పనులు పూర్తయ్యేదెన్నడో..

వేసవిలో నిర్మాణ పనులకు టెండర్లు, పిలిచి పనులు ఖరారు చేశారు. ప్రధానంగా ఎల్–3 పథకంలో సాగర్ ఎడమకాల్వకు మేజర్ ఏర్పాటు చేసి, 300 మీటర్లు కాల్వల్లో నీరు ప్రవహించి, ఎత్తిపోతల పథకం ఇన్‌టేక్ వెల్‌లోకి చేరుతోంది. అక్కడ నుంచి రెండు దశలలో ఎత్తిపోస్తారు. స్టేజీ–1లో 80 హెచ్‌పీ సామర్థ్యం గల మూడు మోటార్లు నీటిని ఎత్తిపోస్తే దాదాపు 2500 ఎకరాలకు సాగునీరందుతుంది. స్టేజీ–2లో 1.8 కిలోమీటర్లు పైపులైను ద్వారా 180 హెచ్‌పీల సామర్థ్యం గల మూడు మోటార్ల ద్వారా నీటిని ఎత్తిపోసి 2300 ఎకరాలకు సాగునీరందిస్తారు. ఎత్తిపోతల పథకం ఎల్–3 పరిధిలో నిడమనూరు మండంలోని నిడమనూరు, ఊట్కూరు, ముప్పారం, హాలియా మండలంలోని పాలెం, శ్రీనాథపురం, చింతగూడెం గ్రామాల పరిధిలోని రైతులకు 4800 ఎకరాలకు సాగునీరందుతుంది. సాగర్ కాల్వల ఆధునీకీకరణ పనుల్లో 2017లో ఎడమకాల్వ లైనింగ్‌తోపాటు ఎత్తిపోతల పథకాల మరమ్మతులు కూడా చేశారు. కొత్త మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, ప్యానల్ బోర్డులు ఏర్పాటు చేశారు. కానీ అప్రోచ్ కెనాల్ సీసీ పనులు చేపట్టకపోవడంతో ఇన్‌టేక్ వెల్ బయట నీరు చేరి కూలింది. సాగర్ ఎడమకాల్వకు మార్చి–2025లో నీటి విడుదల నిలిపివేయగానే మరమ్మతులు చేపట్టాల్సి ఉండగా, మరమ్మతు పనులు ప్రతిపాదనలకు అనుమతులు, నిధులు విడుదల, టెండర్ల ఖరారులో జాప్యంతో ఆలస్యమైంది. జూన్ మొదటి వారంలో ఎత్తిపోతల పథకం ఎల్–3 ఇన్‌టేక్ వెల్ నిర్మాణానికి టెండర్లు పిలవగా రూ.37లక్షలకు అగ్రిమెంట్ జరిగింది. 7.25మీటర్ల ఎత్తు, 19 మీటర్ల పొడవు, 6.5మీటర్ల వెడల్పుతో ఇన్‌టేక్ వెల్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. పనులు ప్రారంభించి, రెండు నెలలు అయినా వెల్ బెడ్ నిర్మాణం చేపట్టి, సగం వరకైనా ఇన్‌టేక్ వెల్(బావి) నిర్మాణం చేపట్టి సాగునీరందించాలని నీటి పారుదల శాఖ అధికారులు యోచిస్తున్నారు.

పొలం బీడుగా మారింది



ఎత్తిపోతల పథకం ఇన్‌టేక్ వెల్ సకాలంలో నిర్మించడంలో నీటిపారుదల శాఖ అధికారులు విఫలమయ్యారు. దీంతో మా పొలాలు బీడుగా మారాయి. మా కళ్ల ముందు సాగర్ ఎడమకాల్వ ప్రవహిస్తున్న సాగునీరందక రైతులం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. లిఫ్టుల కింద రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. లిఫ్టు నిర్వహణ కూడా మేమే భరిస్తున్నాం.

– ఆవుదొడ్డి గంగారాజు, ముప్పారం

వ్యవసాయమే ఆధారం



మా కుటుంబం వ్యవసాయమే ఆధారం, మాకు లిఫ్టు కింద నాలుగు ఎకరాల పొలం ఉంది. వానాకాలం ఆలస్యంగానైన ఈనెలాఖరు వరకు నీరిస్తే సాగు చేసుకుంటాం. సాగునీటి విడుదలపై అధికారులు స్పష్టమైన ప్రకటన చేయడం లేదు. పనులు త్వరితగతిన పనులు పూర్తి చేసి నీరందించాలి.

– చిలుకల పుష్ప, ముప్పారం

సాగునీరందించేందుకు ప్రయత్నిస్తున్నాం

ఎత్తిపోతల పథకం ఎల్–3 ఇన్‌టేక్ వెల్ పనులు వేగవంతం చేశాం. ఈనెలాఖరు వరకు కొంత వరకైనా పూర్తిచేసి, సాగునీరందించే ప్రయత్నాలు చేస్తున్నాం. ఇన్‌టేక్ వెల్ నిర్మాణానికి ఒకే ఒక టెండరు వచ్చింది. తిరిగి రీ టెండరు, వంటి ప్రాసెస్ చేస్తే రైతులకు నష్టం వస్తోందని. సంబంధిత కాంట్రాక్టరు రూ.36 లక్షలకు అగ్రిమెంటు చేసి పనులు చేపట్టేలా చేశాం. త్వరితగతిన పనులు పూర్తి చేసి సాగునీరందిస్తాం.

– జగపతిబాబు, ఏఈ

విద్యార్థినులను ఉన్నతులుగా తీర్చిదిద్దాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



విద్యార్థినుల నుంచి సమాధానాలు రాబడుతున్న కలెక్టర్ త్రిపాఠి

గుర్రంపోడు : కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయాల్లో చదివే విద్యార్థినులను ఉన్నతులుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. సోమవారం మండలకేంద్రంలోని కేజీబీవీని తనిఖీ చేసి వంటగది, డైనింగ్ పరిశుభ్రత పరిసరాలను పరిశీలించారు. విద్యార్థినులు అనారోగ్యం పాలుకాకుండా వ్యక్తిగత, పరిసర పరిశుభ్రతను పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి తరగతిలో విద్యార్థినులు చదువుతోపాటు ఇతర అంశాలతో చురుకుగా ఉండే విధంగా ప్రత్యేక దృష్టి కేంద్రికరించాలని ఎస్ఓ విజయశ్రీకి సూచించారు. విద్యార్థినుల నుంచి పాఠ్యాంశాలకు సంబంధించి ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించి జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద వచ్చిన దరఖాస్తులకు వాటి పరిష్కారం, వివరాలు అడిగి తెలసుకున్నారు. దరఖాస్తులు ఎక్కువగా వచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోగుల సంఖ్య, ప్రసవాలు, సీజనల్ వ్యాధుల గురించి వైద్యసిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి, గుర్రంపోడు తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రేబిస్ వ్యాధిపై అవగాహన



హాలియా : అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఈఓ బిక్షపతి



త్రిపురారం : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ నాగేందర్

హాలియా : వీధి కుక్కలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని డీఈఓ బొల్లారం బిక్షపతి అన్నారు. సోమవారం హాలియా పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో వీధి కుక్కల నియంత్రణ, రేబిస్ వ్యాధిపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఏ గ్రామం, పట్టణం, వార్డుల్లో చూసిన వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయన్నారు. గుంపులుగా తిరిగే కుక్కలు చాలా ప్రమాదకరంగా ఉండే అవకాశం ఉన్నందున ఒంటరిగా వెళ్లకూడదని విద్యార్థులకు సూచించారు. వీధి కుక్కలు కరచినట్లయితే ఆ గాయాన్ని 5–10 నిమిషాలు చల్లని నీటితో కడిగి కార్బాలిక్ యాసిడ్ కలిగిన సబ్బుతో శుభ్రం చేయాలని, కుక్క కాటును నిర్లక్ష్యం చేయకుండా డాక్టర్ సలహా తీసుకొని టీకా కోర్సులను పూర్తిస్థాయిలో వాడాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ గుండా కృష్ణమూర్తి, ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు సైదులు ఉన్నారు.

పెద్దవూర : రేబిస్ వ్యాధితో విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని ఎంపీడీఓ ఉమాదేవి అన్నారు. సోమవారం ఆమె మండలంలోని చలకుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు రేబిస్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీలక్ష్మీ, పంచాయితీ కార్యదర్శి రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

త్రిపురారం : విద్యార్థులు వీధి కుక్కల పట్ల అప్రమత్తంగా ఉండాలని త్రిపురారం మండల పశువైద్యాధికారి డాక్టర్ నాగేందర్ అన్నారు. సోమవారం మండలంలోని దుగ్గెపల్లి, అన్నారం, కొణతాలపల్లి, కంపాలపల్లి, కామరెడ్డి గూడెం, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కుక్క కాటు వేసిన వేసిన వెంటనే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రేబిస్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అడవిదేవులపల్లి : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం గ్రామ పంచాయితీ కార్యదర్శి దుర్గయ్య ఆధ్వర్యంలో కుక్క కాటు వ్యాక్సిన్‌పై అవగాహన కల్పించారు. కుక్కకాటుతో చాల ప్రమాకరమని, సరైన సమయంలో చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వరలక్ష్మి, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రావు, సుహాసిని, వెంకటేశ్వర్లు ఉన్నారు.

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : మండలంలోని అల్వాల ప్రాథమికోన్నత పాఠశాలలో రేబిస్ వ్యాధి నివారణపై సోమవారం విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం బాణోతు సక్రు నాయక్ మాట్లాడారు. విద్యార్థులు వీధి కుక్కల జోలికి వెళ్లకుండా దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి సైదా నాయక్, ఉపాధ్యాయులు తిరుమల్‌రెడ్డి, జానీపాషా, రామాంజిరెడ్డి, అశోక్, భవాని, విజయలక్ష్మీ పాల్గొన్నారు.

రాములునాయక్ ఆశయ సాధకు కృషిచేయాలి



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ అర్బన్ : నిత్యం పేదలకు అండగా నిలిచి పేదల సంక్షేమం కోసం రాజీలేని పోరాటాలను నిర్వహించిన సీపీఎం సీనియర్ నేత ధీరావత్ రాములునాయక్ ఆశయ సాధనకు కృషిచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. సోమవారం మిర్యాలగూడ మండలం కాలువపల్లిలో రాములునాయక్ స్థూప ఆవిష్కరణలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాలువపల్లి, యాద్గార్‌పల్లి, ఉట్లపల్లి గ్రామాల్లో భూ పోరాటాలను నిర్వహించి పేదలకు పంచారన్నారు. భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటాలను నిర్వహించారన్నారు. రాములునాయక్ తుది శ్వాస విడిచేంత వరకు కూడా ఎర్రజెండా కోసం పని చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల పార్టీ కార్యదర్శి మూఢవాత్ రవినాయక్, వెంకటేశ్వర్లు ఉన్నారు.

క్లుప్తంగా

నేడు మండల స్థాయి క్రీడా పోటీలు

దేవరకొండ: దేవరకొండ పట్టణంలో మంగళవారం మండల స్థాయి క్రీడా ఎంపికలు నిర్వహించనున్నట్లు దేవరకొండ ఎంఈఓ మాత్రు నాయక్ తెలిపారు. సోమవారం ఎస్‌జీఎఫ్ ఎంపికల నేపథ్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగే ఎంపికల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. అదే విధంగా కబడ్డీ, వాలీబాల్, ఖో ఖో క్రీడల్లో ఎంపికలు జరుగుతాయని ఆమె పేర్కొన్నారు. సమావేశంలో వ్యాయామ ఉపాధ్యాయులు,తదితరులున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెద్దఅడిశర్లపల్లి : మండల కేంద్రంలోని కస్తూరిబాగాంధీ పాఠశాలలో గెస్టు టీచర్‌గా హిందీ సబ్జెక్టు భోధించుటకు అర్హతగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కస్తూరిబా గాంధీ ఎస్ఓ ఉమాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల అభ్యర్థులు మూడు రోజుల్లో పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వినతిపత్రం అందజేత

డిండి : వ్యవసాయ కార్మికులు, ఉపాధి కూలీలకు సమగ్ర వ్యవసాయ చట్టాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ వ్యవసాయ కార్మికులు సోమవారం తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా ప్రతి కుటుంబానికి 200రోజులు పని కల్పించి దినసరి కూలి రూ.700 ఇవ్వాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీపీఐ మండలసహాయ కార్యదర్శి శైలేష్, ఆ సంఘం మండల ప్రధాన కార్యదర్శి హుస్సేన్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

మిర్యాలగూడ టౌన్ : విద్యారంగంలో దోపిడీని అరికట్టి పూర్తి స్థాయిలో నాణ్యతతో కూడిన ఉచిత విద్యను అందించాలని డిమాండ్ చేస్తూ ప్రోగ్రెసివ్ స్టూడెంట్ యూనియన్ ఆధ్వర్యంలో ముద్రించిన పోస్టర్‌ను సోమవారం స్థానిక అమరవీరుల స్థూపం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల నాగరాజు మాట్లాడుతూ పాలక ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు దాసోహం అంటూ విద్యను నిర్వీర్యం చేస్తుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత విద్య వ్యాపారాన్ని అరికడుతామని చెప్పి రెండేళ్లు పూర్తి కావొస్తున్న నేటి వరకు అరికట్టకపోవడంతో పాటు విద్యను వ్యాపారంగా మారుస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పీఎస్‌యూ జిల్లా కన్వీనర్ మచ్చ వంశీ, డివిజన్ అధ్యక్షులు వి. రవికుమార్, అఖి, మనోజ్, అంజి, మహేష్, అజయ్ ఉన్నారు.


వైద్యశిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

దేవరకొండ : ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ సీఐ వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఫిజియోథెరపీ వైద్య శిబిరాన్ని అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్‌వీటీతో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్యం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్.సునీల్ కుమార్, తాళ్ల శ్రీధర్ గౌడ్, తాళ్ల సురేష్, సముద్రాల వెంకన్న, భాస్కర్, ఆంజనేయులు, బుడిగ వెంకటేష్, చైతన్య, ఏడుకొండలు, సందీప్ పాల్గొన్నారు.

అల్పాహారం అందించాలి

మాడుగులపల్లి : మండలంలోని కేజీబీవీ విద్యార్థినులకు పాఠశాల సమయానుకూలంగా అల్పాహారం అందించడంలేదని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్‌లు అన్నారు. సోమవారం నల్లగొండలో కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కేజీబీవీ విద్యార్థినులకు ఉదయం ఎనిమిది గంటలకు అందించాల్సిన అల్పాహారం 10.45గంటలకు పెట్టడం వల్ల విద్యార్థినులు నీరసానికి గురువుతన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలో ప్రభుత్వ మెనూ అమలు కావడం లేదని, ఎస్ఓ రెగ్యులర్‌గా పాఠశాలకు రావడం లేదని ఆరోపించారు. నిర్లక్ష్యం వహిస్తున్న ఎస్ఓపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కుర్ర సైదానాయక్, కిరణ్, వీరన్న,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్ట్రక్టర్‌కు స్కిల్ ట్రైనింగ్ ఉత్తమ అవార్డు



అవార్డు అందుకుంటున్న రమావత్ శ్రీను

డిండి : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐలో ఎలక్ట్రిషియన్ ఇన్‌స్ట్రక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రమావత్ శ్రీను ఐటీఐ స్కిల్ ట్రైనింగ్ ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యారు. కాగా సోమవారం హైదరాబాద్‌లో కార్మిక ఉపాధి, శిక్షణ, పరిశ్రమ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి నుంచి శ్రీను అవార్డు ప్రశంసా పత్రం అందుకున్నాడు. దీంతో స్థానిక ఐటీఐ ప్రిన్సిపాల్ వి.రాధాకృష్ణ అభినందించారు.

విధుల్లో చేరిన గ్రామ పాలనాధికారులు



గుర్రంపోడు : తహసీల్దార్ కార్యాలయంలో విధుల్లో చేరుతున్న జీపీఓలు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మండలంలోని 15 క్లస్టర్లకు గాను 16 మంది గ్రామ పరిపాలన అధికారులు సోమవారం తహసీల్దార్ ఎస్ సురేశ్‌కుమార్ సమక్షంలో విధుల్లో చేరారు. ముందుగా వారికి తన ఛాంబర్స్‌లో విధి విధానాలపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసిల్దారు రజనీకాంత్, సినియర్ అసిస్టెంట్ ఎంఏ మతీన్, ఆర్ఐలు ఠాగూర్ రామకృష్ణ,, కృష్ణయ్య తదితరులున్ననారు.

నిడమనూరు : నిడమనూరు మండలానికి 8 మంది గ్రామ పాలనాధికారులను నియమించగా వారు సోమవారం ఏడుగురు విధుల్లో చేరారు. తహసీల్దారు జంగాల కృష్ణయ్య డ్యూటీ చార్ట్, గ్రామాల్లో రెవెన్యూ విధులు గ్రామ పాలనాధికారుకు వివరించారు. నిడమనూరు మండలంలో 29 గ్రామ పంచాయతీలు, 15 రెవెన్యూ గ్రామాలు ఉండగా, 8 రెవెన్యూ క్లస్టర్లుగా విభజించగా, 8 మంది గ్రామ పాలనాధికారులు కొత్తగా వచ్చారు. ఇప్పటి నుంచి ఏ ధ్రువీకరణ పత్రం కావలన్నా ప్రాథమికంగా గ్రామ పాలనాధికారులు ధ్రువీకరించాల్సి ఉంటుంది.

గుర్రంపోడు : గుర్రంపోడు మండలానికి 11 మంది గ్రామ పాలనాధికారులను కేటాయించగా వారు సోమవారం విధుల్లో చేరినట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని చేపూరు, చింతగూడెం, గుర్రంపోడు, జూనూతుల, కొప్పోలు, నడికూడ, పాల్వాయి, తేనపల్లి, తానేదార్‌పల్లి , వట్టికోడు,చామలేడు క్లస్టర్‌లకు జీపీఓలను అలాట్ చేసినట్లు తెలిపారు.

10న సురవరం సంస్మరణ సభ

మిర్యాలగూడ అర్బన్ : నల్లగొండ మాజీ ఎంపీ, సీపీఐ నేత సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభను బుధవారం నల్లగొండలోని జీఎల్ గార్డెన్‌లో నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి సమావేశం దామరచర్ల మండల కార్యదర్శి ఉదయ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సంస్మరణ సభకు తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనమినేని సాంబశివరావు, తెలంగాణ ప్రెస్ ఆకాడమి చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి, సీపీఐ జాతీయ నేత పల్లా వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సీపీఎం రాష్ట్ర కార్యవదర్శి వర్గసభ్యుడు జూలకంటి రంగారెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహ్మారెడ్డిలు హాజరవుతున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ భూములను కాపాడాలని వినతి

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని మూడో వార్డు తాళ్లగడ్డలో అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ సోమవారం నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠికి స్థానికులు వినతిపత్రం అందజేశారు. తాళ్లగడ్డలోని ఇందిరమ్మ కాలనీలో 5, 7 సర్వే నంబర్లతో పాటు 60, 61, 519, 518 సర్వే నెంబర్లలోని ప్రభుత్వ సీలింగ్ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని సామాజిక కార్యకర్త చిలుముల కొండల్ కలెక్టర్‌కు వివరించారు. ఇందిరమ్మ కాలనీ లే అవుట్ –5లో వాటర్ ట్యాంకు నిర్మాణానికి కేటాయించిన 18గుంటల భూమి ఆక్రమణకు గురైందని, అదే విధంగా పార్క్ స్థలం కూడా కబ్జాకు గురి అయినా ఈ విషయంపై అనేక సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఎలాంటి ఫలితం లేకుండా పోయిందని తెలిపారు. చెరువు భూమి కూడా సుమారు 15 ఎకరాల వరకు భూమి కబ్జాకు గురి అయిందని, సమగ్ర విచారణ జరిపించి ప్రభుత్వ భూమిని రక్షించాలని కోరారు.

జీఎస్టీ సంస్కరణలతో పేదలకు మేలు



మిర్యాలగూడ టౌన్ : మోదీ ఫ్లెక్సికీ పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

మాడుగులపల్లి : కేంద్ర ప్రభుత్వం ఇటీవల జీఎస్టీలో తీసుకొచ్చిన సంస్కరణ వల్ల దేశంలోని పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జీఎస్టీలో తీసుకొచ్చిన సంస్కరణతో నిత్యావసర వస్తువుల ధరలు భారీగా తగ్గడంతో ప్రజలకు ఎంతో ఊరటనిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్‌మోర్చ జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు వీరెల్లి చంద్రశేఖర్, విద్యాసాగర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు జాన్‌రెడ్డి, కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకట్‌రెడ్డి, బొమ్మకంటి నరసింహ, నాగరాజు, శ్రీను, సైదులు, దశరథ, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ ఫ్లెక్సికీ పాలాభిషేకం

మిర్యాలగూడ టౌన్ : జీఎస్‌టీని తగ్గించినందుకు సోమవారం వన్ టౌన్ బీజేపీ ఆధ్వర్యంలో పట్టణంలోని రాజీవ్ చౌక్ వద్ద భారత ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఫ్లెక్సికి ఆ పార్టీ వన్ టౌన్ ప్రధాన కార్యదర్శులు కొంగరి వెంకటరమణ, మూల రాజీరెడ్డిల ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆపార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాధినేని శ్రీనివాస్‌రావు, మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు బంటు సైదులు, రేపాల పురుషోత్తంరెడ్డి, రమేష్, సజ్జల నాగిరెడ్డి, ముక్కపాటి వెంకటేశ్వర్‌రావు, శివ, ఉన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

మాడుగులపల్లి : మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని సోమవారం సీఐటీయూ నాయకులు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కొండేటి నర్సయ్య, ఇరుగు యాదమ్మ, వెంకన్న, నాగరాజు, యాదమ్మ, ఎల్లయ్య, సునీత, ఇమ్మానియేల్, దాసు, వెంకట్ పాల్గొన్నారు.

భవన నిర్మాణ నిధికి రూ.21వేలు విరాళం



భవన నిర్మాణ నిధికి విరాళం అందిస్తున్న చంద్రమౌళి

దేవరకొండ : పట్టణంలోని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవన నిర్మాణ నిధికి ఆ సంఘం కార్యదర్శి అంకం చంద్రమౌళి తన 1వ పుట్టిన రోజును పురస్కరించుకొని సోమవారం రూ.21వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సభ్యుల సహకారంతో తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం ఆయన తన పుట్టిన రోజు వేడుకలను రిటైర్డ్ ఉద్యోగుల సమక్షంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు తాడిశెట్టి నరసింహ, పంగునూరి లింగయ్య, సత్యమూర్తి, యూసుఫ్‌షరీఫ్, దామోదర్‌రెడ్డి, వసంతకు మారి, నారాయణరెడ్డి, పురుషోత్తం, వీరయ్య, కోటయ్య, ప్రభాకర్, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

అరుదైన చికిత్సతో ప్రాణాలను కాపాడిన వైద్యులు



చికిత్స పొందిన వ్యక్తితో కలిసి వివరాలు తెలియజేస్తున్న వైద్యులు

నాగార్జునసాగర్ : రోడ్డుప్రమాదంలో గాయపడిన వ్యక్తికి అరుదైన చికిత్స చేసి ప్రాణాలను కాపాడటమే కాకుండా అంగవైకల్యం రాకుండా సర్జరీ చేసి కాలును యథాస్థితికి తీసుకొచ్చినట్లు మలక్‌పేట యశోద ఆస్పత్రి డాక్టర్లు తెలిపారు. సోమవారం స్థానిక విజయవిహార్‌లో చికిత్స పొందిన వ్యక్తితో కలిసి డాక్టర్ల బృందం ఆపరేషన్ చేసిన విధానాలను వివరించారు. తిరుమలగిరి (సాగర్) మండలం తెట్టెకుంటకు చెందిన మొకరాల పవన్(20)కు సాగర్ సమీపంలోని కంకరమిల్లువద్ద రోడ్డుప్రమాదంలో ఎడమ కాలు తొడ ఎముక విరగడం వల్ల ఫీమోరల్ ఆర్టరీ చీలికతో రక్తప్రసరణ ఆగిపోయి ప్రాణాంతక పరిస్థితి ఏర్పడింది. అటువంటి స్థితిలో డాక్టర్ రంజిత్ కుమార్ అనందసు వ్యాస్కులర్ సర్జన్, డాక్టర్ ప్రపుల్ కిలారు ఆర్థోపెడిక్ సర్జన్‌లు ఎముకకు ఎక్స్‌టర్నల్ ఫిక్సేషన్ ఫీమేరల్ పాప్లిటీయల్ బైపాస్ శస్త్రచికిత్స చేసి రక్త ప్రసరణను పునరుద్ధరించినట్లు తెలిపారు. ఇది సవాళ్లతో కూడిన ట్రామా కేసని, రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రోగికి ఎముక విరగడం మాత్రమే కాక ఫీమేరల్ ఆర్టరీ పూర్తిగా చీలిపోవడం వల్ల ప్రాణానికి ముప్పు వాటిల్లే పరిస్థితి అని వివరించారు. వాస్క్యులర్ బైపాస్, ఆర్థోపెడిక్ స్టెబిలైజేషన్, ప్లాస్టిక్ రీకన్‌స్ట్రక్షన్ చివరగా ఇంప్లాంట్ ఫిక్సేషన్ ఇవ్వన్ని సమన్వయంతో చేయడం వల్లే రోగి ప్రాణాన్ని, కాలును కూడా రక్షించగలిగామని, రోగి కోలుకోవడం ఆనందదాయకమని పేర్కొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

హాలియా : వానాకాలంలో ప్రజలు లతమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల స్పెషల్ ఆఫీసర్ బొల్లారం బిక్షపతి సూచించారు. సోమవారం అనుముల మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామాల్లోని పరిసరాలు అపరిశుభ్రంగా దోమలు, ఈగలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దోమల నివారణకు దోమల మందును పిచికారీ చేసి ప్రజలను దోమల బారి నుంచి కాపాడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్ల సలహాలు తీసుకుని నివారణ చర్యలు చేపట్టాలని సూచించా రు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సుజాత, పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

యూరియా కోసం తిప్పలు



అడవిదేవులపల్లి : పీఏసీఎస్ వద్ద చెప్పులు క్యూలో ఉంచిన రైతులు



త్రిపురారం : పెద్దదేవులపల్లిలో..



డిండి: యూరియా కోసం బారులుదీరిన రైతులు

త్రిపురారం : యూరియా కోసం సోమవారం వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున వచ్చిన రైతులు మండల కేంద్రంలో ప్రధాన సెంటర్‌లో రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. పోలీసులు జోక్యం చేసుకొని రైతుల ధర్నాను విరమింపజేశారు. అనంతరం త్రిపురారం, పెద్ద దేవుల పల్లి పీఏసీఎస్‌లకు యూరియా వచ్చిందని తెలుసుకున్న రైతులు అక్కడి వెళ్లి వరుసలో చెప్పులు పెట్టి ఎదురుచూశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ విజయ కుమారి, వ్యవసాయ అధికారి పార్వతి చౌహాన్, సీఐ సతీష్, ఎస్ఐ నరేష్‌లు సరఫరాపై సమావేశం నిర్వహించారు.

అడవిదేవులపల్లి : మండల కేంద్రంలో యూరియా కోసం సోమవారం రైతు వేదిక వద్ద రైతులు తమ ఆధార్ కార్డులు, చెప్పులను క్యూలో ఉంచారు. ఏఓ గుర్రం సరిత రైతుకు ఒక్క బస్తా చొప్పున చిట్టిపై రాసి ఇస్తున్నారు. దీంతో పలు గ్రామాల నుంచి వచ్చిన రైతులు రైతు వేదిక వద్ద తెల్లవారు ఝాము నుంచి పట్టదారు పాసు పుస్తకాలు, ఆధార్‌కార్డులు, చెప్పులను క్యూలో ఉంచారు.

డిండి : మండలంలో యూరియా కోసం పీఏసీఎస్ భవనం వద్ద ప్రతి రోజు పడిగాపులు కాస్తున్న దొరకడం లేదు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం వద్ద ఉదయం ఆరు గంటల సమయం నుంచే రైతులు బారులుదీరినప్పటికీ గోదాంలో నిల్వ ఉన్న యూరియాను 11 గంటల వరకే సబందితాధికారులు అందజేశారు.

ఉపాధ్యాయ అవార్డుల ఎంపికలో అవకతవకలు

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అందజేసిన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపికలో అవకతవకలు జరిగాయని ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు నల్లబెల్లి జగదీశ్ డిమాండ్ ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ఎంపికకు కనీసం 15ఏళ్ల సర్వీస్‌ఉండాలని, కానీ ఆ నిబంధనలు పాటించకుండా త్రిమెన్ కమిటీలో నిర్ణయం తీసుకొని ఎలా ఆమోదించారని ప్రశ్నించారు. కొన్నేళ్లుగా విధులు నిర్వర్తిస్తూ సీనియర్స్‌గా అర్హత ఉండి కూడా అవార్డు అందుకోలేకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు శివ, నరేశ్, బ్రహ్మం, మహేష్ తదితరులు పాల్గొన్నారు.